## క్లుప్తంగా

### 25న వాహనాల వేలం

సాలూరు: వివిధ కేసులలో సీజ్‌చేసిన 7వాహనాలకు ఈ నెల 25 ఉదయం 10.30 గంటలకు పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద వేలం పాట నిర్వహించనున్నట్లు పట్టణ ఎస్సై పాపారావు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సుధాకర్‌రావు పర్యవేక్షణలో 4 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలకు వేలం వేయనున్నామన్నారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

### ఉపాధ్యాయులకు శిక్షణ



తెలుగు సబ్జెక్టు బోధనలో మెలకువలు తెలియజేస్తున్న ఉపాధ్యాయుడు

బలిజిపేట: బలిజిపేట, సీతానగరం మండలాలకు చెందిన తెలుగు స్కూల్ అసిస్టెంట్స్‌కు పెదపెంకి ఉన్నత పాఠశాలలో తెలుగు సబ్జెక్టుపై శిక్షణ తరగతులు బుధవారం ఇచ్చారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎస్.రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రెండు మండలాలకు సంబంధించి 27మంది ఉపాధ్యాయులకు శిక్షణకు హాజరయ్యారు. తెలుగు సబ్జెక్టు బోధనలో ఉండే మెలకువలను ఉపాధ్యాయులకు శిక్షణలో వివరించారు. తెలుగు పాఠ్యాంశాలు విద్యార్థులకు సులువైన పద్ధతిలో బోధించే అంశాలపై వారికి శిక్షణ ఇచ్చినట్టు చైర్మన్ రామారావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం



నేతాజీ గ్రంథాలయం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రం

బలిజిపేట: వేసవి ప్రభావం ప్రారంభం కావడంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మండలంలోని పెదపెంకి గ్రామంలో నేతాజీ గ్రంథాలయం వద్ద ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రం ప్రారంభించారు. వేసవికాలం పూర్తయ్యేవరకు చలివేంద్రాన్ని నిర్వహిస్తామని సంజీవనాయుడు ఈ సందర్భంగా తెలిపారు. స్నేహచైత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తినాయుడు, ఎ.సత్యం, టీపీఆర్ పట్నాయక్‌ల సహకారంతో చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బి.హర్ష, హేమంత్, ఎస్.శ్రీను, ఎం.శ్రీను, జి.శ్రావణ్, పి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### నేత్ర వైద్యశిబిరం విజయవంతం



నిర్వహిస్తున్న నేత్ర వైద్యశిబిరం

సాలూరు: పట్టణంలోని నవజీవన్ ఆశ్రమంలో బుధవారం నిర్వహించిన నేత్ర వైద్యశిబిరం విజయవంతమైంది. 118 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 46 మందికి ఆపరేషన్‌లు అవసరమని పుష్పగిరి కంటి వైద్యులు పేర్కొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో క్యాంపు కో ఆర్డినేటర్ సురేష్, వర్షిణి,ఆశ్రమ నిర్వాహకురాలు చిన్నమ్మలు తదితరులు తెలిపారు.

### తొలగించిన ఫ్లెక్సీలు



తొలగిస్తున్న రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు

సాక్షి ఎఫెక్ట్...

సాలూరు: ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నప్పటికీ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు తొలగించకపోవడంపై 'ప్రతిపక్ష పార్టీల ఫ్లెక్సీలు కనిపించడం లేదా' అనే శీర్షికన ఈ నెల 22న సాక్షిలో ప్రచురితమైన కథనంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం మున్సిపాలిటీలో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించడం కనిపించింది.

### అమ్మవారి పండగకు ఏర్పాట్లు

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో అమ్మవారి పండగ నిర్వహణకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. 64 ఏళ్ల అనంతరం చేపడుతున్న గ్రామదేవత ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని గ్రామస్తులు నిర్ణయించారు. ఈ మేరకు గ్రామ పెద్దలు, యువత బుధవారం గ్రామంలో పర్యటించి ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఆర్థిక స్తోమత ఆధారంగా చందాలను నిర్ణయించి పండగ ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ 23 నుంచి మే 3 వరకు పండగ చేసేందుకు నిర్ణయించారు.

## సొంతింటికల సాకారానికే

# జగనన్న కాలనీలు

- రాష్ట్ర గృహ నిర్మాణశాఖ ఎం.డి లక్ష్మీ శా



కాశీపేట జగనన్న కాలనీ లబ్ధిదారులతో మాట్లాడుతున్న రాష్ట్ర హౌసింగ్ ఎం.డి లక్ష్మీ శా

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్న లబ్ధిదారులకు నిర్దేశించిన శాఖల అధికారులు సహకరించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) లక్ష్మీ శా సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన సీతానగరం మండలం కాశీపేటలో రాష్ట్రరహదారిని ఆనుకుని ఉన్న జగనన్న లేఅవుట్‌లో గృహనిర్మాణాలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారుల నుద్దేశించి మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరి సొంతింటికల నెరవేర్చడానికి ప్రభుత్వం స్థలాలను సమకూర్చి, ఇళ్లు మంజూరుచేసి, రాయితీపై ముడి సరుకును మండలకేంద్రంలోనే సమకూరుస్తోందని చెప్పారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు.

**అందరికీ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి**

అలాగే ఇళ్ల నిర్మాణాల్లో వెనుక బడి ఉన్న లబ్ధిదారులకు వెలుగు ద్వారా స్వల్ప వడ్డీతో రుణం సమకూర్చాలని డీఆర్‌డీఏ ఏపీడీ కె.సావిత్రిని ఆదేశించారు. విద్యుత్ లైన్లు వేసినప్పటికీ కొన్ని ఇళ్లకు సర్వీసులు ఇవ్వాలి ఉందన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారందరికీ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని సూచించారు. బేస్‌మెంట్ లెవెల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ జిల్లా ప్రాజెక్ట్ అధికారి రఘురాం, ఈఈ ప్రసాద్ బాబు, ఏఈ జనకీరాం, హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

**ఇళ్లు కాదు ఊళ్ల నిర్మాణం**



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ ఎం.డి డాక్టర్ జి. లక్ష్మీశా

సాలూరు: రాష్ట్రంలో ఇళ్లను కాదని ఏకంగా ఊళ్లనే నిర్మిస్తున్నామని హౌసింగ్ ఎం.డి డాక్టర్ జి.లక్ష్మీశా అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని నెలిపర్తి లే అవుట్, మండలంలోని కరాసవలసలో జరుగుతున్న గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. మంజూరైన ఇళ్లు ఎన్ని? ఏయే దశలలో ఎన్ని నిర్మాణాలు ఉన్నాయో నేరుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారికి అందిన ముడిసరుకులు, బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై ఆరా తీసి ఇంకేమైనా సమస్యలుంటే తెలపాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో మాట్లాడుతూ, పేదవాడి సొంతింటి కల సాకారమయ్యే క్రమంలో వారి ఇంటి నిర్మాణంలో భాగస్వాములవమవుతున్నామని గర్వించాలన్నారు. ఇళ్లు మంజూరై నిర్మాణాలు ప్రారంభించని వారిని గుర్తించి వారికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలు, తదితర అంశాలపై అవగాహన పెంపొందించి నిర్మాణాలు త్వరగా జరిగేలా చేయాలని సూచించారు. నిర్మాణం పూర్తయిన ఇంటి వద్ద ప్రభుత్వం నేమ్‌బోర్డులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు.

**ఉగాదికి ఐదు లక్షల ఇళ్ల నిర్మాణం**

రాష్ట్రంలో మంజూరైన 18.63 లక్షల ఇల్లలో ఇప్పటివరకు 2.52 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. 17,003 లే అవుట్‌లు మంజూరు చేశామని తెలిపారు. ఈ ఉగాదికి 5 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేయడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగా రాష్ట్రస్థాయి అధికారులు ప్రతి జిల్లాలో పర్యటిస్తూ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడానికి కృషి చేస్తున్నామని వివరించారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ రఘురాం, మున్సిపల్‌కమిషనర్ శంకరరావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాను ప్రసాద్, హౌసింగ్ డీఈ సోమేశ్వరరావు, అధికారులు శ్రీనివాసరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఓ ప్లాంట్లపై చర్యలు చేపట్టాలి

- 'అడంగడి చెప్తాం'లో సీపీఐ విజ్ఞప్తి



సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

పార్వతీపురం టౌన్: ఆర్‌ఓ ప్లాంట్‌లపై విజిలెన్స్ అధికారులు చర్యలు చేపట్టాలని సీసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ చదలవాడ హరిబాబు కోరారు. పట్టణంలోని వేదాంత జూనియర్ కళాశాలలో జాతీయ వినియోగదారుల సమన్వయ సమితి(సీసీఐ) ఆధ్వర్యంలో బుధవారం అడగండి చెబుతాం-విద్యార్థుల హక్కులు తెలుసుకోండి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సమస్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ టోల్ ఫ్రీ నంబర్ 1967ను ప్రవేశపెట్టిందన్నారు. ఐఎస్ఐ ప్రమాణాలు, ఐఎస్ఐ ముద్రలను తీసుకోకుండా నడుపుతున్న ఆర్‌ఓ ప్లాంట్‌లపై విజిలెన్స్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. రంగులు వేయని ఆహార పదార్థాలను కొనుగోలు చేయాలని సూచించారు. విద్యార్థులు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లోని ఆహార పదార్థాలు తిని భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటరమణ, రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఇమ్మాన్యుయేల్, మీడియా ప్రతినిధి రామకృష్ణ, పి.బాలకృష్ణ, కళాశాల యాజమాన్యం మహిళా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థికి గాయాలు

పార్వతీపురం: క్లాస్ వర్క్ చేయలేదని స్కూల్‌లో ఉపాధ్యాయుడు కొట్టడంతో ఒక విద్యార్థికి గాయాలయ్యాయి. ఈ మేరకు పార్వతీపురం ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురంలోని గృహప్రియానగర్‌కు చెందిన పోల భాను ప్రకాష్ స్థానిక సురేష్ స్కూల్‌లో ఆరవ తరగతి చదువుతున్నాడు. ఈనెల 1 నుంచి 4 వ తేదీవరకు ఆరోగ్యం బాగా లేదని స్కూల్‌కు వెళ్లలేదు. ఆరోగ్యం బాగాలేదని, నీరసంగా ఉండడంతో క్లాస్ వర్క్, హోంవర్క్ చేయలేదు. హోంవర్క్ చేయకపోవడంతో క్లాస్ టీచర్ రవికిరణ్ కుడిచేయి భుజంపై గట్టిగా కొట్టారు. దీంతో ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పడంతో చికిత్సకోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

### మహాశివుడికి జలాభిషేకం



గంగాహారతి సమర్పిస్తున్న వేద పండితులు

భామిని: మండలంలోని బాలేరు వద్ద వంశధార నదీ తీరంలో ధ్యానముద్రలో ఉన్న మహాశివుని విగ్రహానికి భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా మహిళలు కలశాలతో ఊరేగింపుగా వచ్చి మహాశివుడికి జలాభిషేకం చేశారు. వేద మంత్రాలతో గంగమ్మకు మహాహారతి సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు జీఎల్‌పురం విద్యార్థి



శ్రీచరణ్

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 బాయ్స్ క్రికెట్ చాంపియన్ షిప్ పోటీలకు గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న పాలక శ్రీచరణ్ ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి.వైకుంఠరావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ..2022 డిసెంబర్‌లో విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో జరిగిన జిల్లాస్థాయి సెలక్షన్స్‌లో శ్రీచరణ్ ఫాస్ట్ బౌలింగ్ విభాగంలో ఉత్తమ ప్రతిభకనబరిచినట్లు చెప్పారు. ఈనెల 23 నుంచి మచిలీపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ చాంపియన్ షిప్ పోటీల్లో విద్యార్థి పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న శ్రీచరణ్‌ను పాఠశాల హెచ్ఎం బిడ్డిక భీముడు, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఉపాధి వేతనదారుల సంఖ్య పెరగాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఏపీడీ శ్రీహరి

గరుగుబిల్లి: ఉపాధిహామీ పథకంలో వేతనదారుల సంఖ్యను పెంచాలని ఏపీడీ(సీతంపేట) జి.శ్రీహరి అన్నారు. మండలంలోని సుంకి, ఉల్లిభద్ర పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు పంచాయతీల్లో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు పూటలా పనుల్లో పాల్గొనేలా వేతనదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్ఎంఎంఎస్ యాప్‌లో మస్తర్లు నమోదు చేయాలన్నారు. వేతనదారుల ఆధార్ నంబర్ అనుసంధానం ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కొత్త నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో ఏపీఓ టి.రామకృష్ణనాయుడు, ఈసీ వైఆర్‌డీ ప్రసాద్, టీఏలు ఎస్.పద్మావతి, ఎం.ఉమామహేశ్వరరావు, భూలక్ష్మి, నిర్మల, నరసింహంతోపాటు పలువురు క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

## ఆలయ వార్షికోత్సవ ఏర్పాట్లపై చర్చ



సమావేశమైన ఆలయ కమిటీ సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంలో ఉమాసహిత కైలాసనాథస్వామి దేవాలయం 40వ వార్షికోత్సవ నిర్వహణపై ఆలయ కమిటీ సభ్యులు బుధవారం చర్చించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు, సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ అధ్యక్షుడు కొత్తకోట విష్ణు, సభ్యులు సురేష్, పైడా నాగేశ్వరరావు, మద్ది దొరబాబు పాల్గొన్నారు. మార్చి 17 నుంచి ఐదు రోజుల పాటు ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. అందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లుపై చర్చించారు. మరోసారి గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించేందుకు తీర్మానం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, మాజీ సర్పంచ్ పాలక ప్రేమానంద్, కమిటీ సభ్యులు కె.సూర్యం, గణేష్, వైస్ సర్పంచ్ కొత్తకోట కిషోర్ తదితరులున్నారు.

### ఏనుగుల కదలికలపై అప్రమత్తం

వీరఘట్టం: నడుకూరు, కిమ్మి, చిట్టపులివలస, కొట్టుగుమ్మడ పరిసర ప్రాంతాల్లోని పంట పొలాల్లో ఏనుగులు సంచరిస్తున్నందున ఆయా ప్రాంతాల రైతులు అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌ఓ రవిబాబు కోరారు. ఏనుగులు ఉన్న ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ట్రాకర్లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఏనుగుల కదలికలను గమనించడంతో పాటు ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా ఎవరూ ఏనుగులను కవ్వించొద్దని కోరార

## వెల్‌నెస్, ఆర్బీకే నిర్మాణాలు వేగవంతం చేయాలి



అంటిపేటలో వెల్‌నెస్ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

సీతానగరం: మండలంలో సచివాలయాల పరిధిలో ఆర్బీకే, వెల్‌నెస్ భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, అంటిపేట ఇంజినీరింగ్ సహాయకుడు నవీన్ కోరారు. ఈ మేరకు బుధవారం అంటిపేట లోతట్టు ప్రాంతంలో నిర్మిస్తున్న రైతుభరోసా కేంద్రం, గ్రామీణ ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ భవన నిర్మాణాలు జరుగుతున్నా వెల్‌నెస్, ఆర్బీకే భవనాల పనులు నత్తనడకగా జరుగుతున్నాయన్నారు. అంటిపేట పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా వెన్నెల బుచ్చింపేట, వెంకటాపురం గ్రామాల్లో ఇంటింటి కుళాయి పనులు పూర్తి కావచ్చాయని తెలియజేశారు. అంటిపేట కాలనీలో సీసీ రోడ్డు వేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎస్.నిర్మల పాల్గొన్నారు.

## ఓపెన్ ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

సీతానగరం: ఏపీ ఓపెన్ సొసైటీ ఆదేశాల మేరకు 2022-23 విద్యా సంవత్సరానికిగాను ఓపెన్ ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఈ నెల 21 నుంచి 27 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బి.రేణుక అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె మాట్లాడుతూ ఇంటర్‌మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం మధ్యలో మానేసిన విద్యార్థులు, పదవ తరగతి ఉత్తీర్ణులై కాలేజీలో చదవకుండా ఖాళీగా ఉన్న వారు అర్హులన్నారు. దీనికి సంబంధించి ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్, కుల ధ్రువీకరణ పత్రం,10వ తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ ఫొటోలు రెండు సమర్పించాలన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ప్రవేశ రుసుము మార్చి 1 నుంచి 7వ తేదీలోగా చెల్లించాలని కోరారు. ఏప్రిల్ నెలలో ఓపెన్ ఇంటర్మీయట్ పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు.

## చేతి వృత్తిదారులను ప్రోత్సహిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డ్ మేనేజర్ నాగార్జున

పార్వతీపురంటౌన్: చేతి వృత్తిదారులను మరింత ప్రోత్సహిస్తామని నాబార్డ్ మేనేజర్ టి.నాగార్జున అన్నారు. మండలంలోని బుదురువాడ పంచాయతీ సంగందొరవలస గ్రామంలో జరిగిన వెదురు ఉత్పత్తుల శిక్షణ ముగింపు సందర్భంగా బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేతివృత్తిదారులను ప్రోత్సహించేందుకు వెదురుతో బుట్టలు, ఫ్లవర్‌వాజ్‌లు, కూజాలు వంటివి తయారు చేసేందుకు 15రోజుల శిక్షణను అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం మేనేజర్, ఐఆర్‌పీడబ్ల్యూఏ డైరెక్టర్ ప్రకాశ్, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

## పామాయిల్ తోటలో మిశ్రమ పంటలు



రైతుకు మెలకువలు వివరిస్తున్న మండల ఉద్యాన అధికారి ప్రత్యూష

సీతానగరం: మండలంలో పామాయిల్ తోటలు వేస్తున్న రైతులు మిశ్రమ పంటలు సాగు చేయడం వల్ల అధిక ఆదాయాన్ని పొందవచ్చని మండల ఉద్యాన శాఖ అధికారి ప్రత్యూష అన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం రేపటివలస, అప్పయ్యపేట గ్రామాల్లో పామాయిల్ తోటల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సరీనుంచి తెచ్చిన మొక్కలు నాటిన పది రోజుల్లోనే మిశ్రమ పంటలుగా తోటకూర, బెండ, చిక్కుడు, మిరప, కర్బూజా తదితర పంటలు సాగు చేయడం వల్ల పామాయిల్ తోటకు కలుపు రావడం తగ్గుతుందని, ఫలసాయం వస్తుందని, ప్రభుత్వం నుంచి రాయితీ వర్తిస్తుందని చెప్పారు. ఇప్పటికే అనంతరాయుడుపేట, బగ్గందొరవలస ఏగోటివలస, గెడ్డలుప్పి రేపటివలస గ్రామాల్లో పామాయిల్ తోటల్లో రైతులు మిశ్రమ పంటలు సాగు చేస్తున్నారని తెలియ జేశారు.

## వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి

సీతానగరం: వైఎస్సార్‌సీపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి తమవంతు కృషి చేస్తామని పార్వతీపురం మన్యం జిల్లా బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు టీవీ శ్రీనివాస్, గన్నవరపు శ్రీనివాస్‌లు అన్నారు. ఈ మేరకు రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బుధవారం విశాఖపట్నంలో నామినేషన్ దాఖలు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతానగరంలో సమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు టీవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గమంతా ఉత్తరాంధ్ర పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతంరాజు సుధాకర్ విజయానికి తమవంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

## సర్కారు వైద్యాన్ని ప్రజలకు చేరువచేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణనాయుడు

వీరఘట్టం: సర్కారు వైద్యాన్ని ప్రజలకు చేరువచేయాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అన్నారు. బిటివాడ పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను ఎంతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రతీ ఇంటికి వైద్య సేవలను అందిస్తోందని, ఆరోగ్య సిబ్బంది ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆస్పత్రి అభివృద్ధి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి, తీర్మానాలు చేశారు. సమావేశంలో వైద్యులు ఎ.మానస, ఎస్.నిబీష, బిటివాడ, వండవ సర్పంచ్‌లు ఎస్.నర్సింహులునాయుడు, మిడితాన కల్యాణి, నీలం సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కళాశాలకు కొత్తకళ

- మారుతున్న రూపురేఖలు
- నాడు నేడు నిధులతో మౌలిక వసతుల కల్పన




నాడు నేడు నిధులతో అందంగా రూపుదిద్దుకుంటున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవనం


సీతానగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు మనబడి నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో కళాశాల రూపురేఖలు మారుతున్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బి.రేణుక మాట్లాడుతూ జీజే కాలేజీ భవనాలు నిర్మించినప్పటికీ మౌలిక సదుపాయాలు తాగునీటి వనరులతో పాటు మరుగుదొడ్లు లేక వందలాది మంది విద్యార్థులు అవస్థలుపడేవారన్నారు. కాలేజీలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మన బడి నాడు నేడు పథకం అమలు చేసి రూ.72 లక్షల 47 వేల 620లు నిధులు విడుదల చేయడంతో ఇంతవరకూ రూ.17లక్షల 62వేల,150లతో చేపట్టిన పనుల పర్యవేక్షణకు అధ్యాపకులు, ఎస్ఎస్ఎస్ పీఓలతో కమిటీని నియమించినట్లు తెలియజేశారు. కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎస్ఏ ఇంజినీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో నిబంధనలకు లోబడి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అప్పటికే భవనాలు బాగున్నా గచ్చులు పూర్తి పాడై గోతులు పడడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా శిథిలమైన గచ్చులస్థానంలో మార్బుల్స్ అమర్చినట్లు చెప్పారు. నాలుగువందల మంది విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మరుగుదొడ్లు నిర్మించినట్లు చెప్పారు.

**మూడో విడత నిధులతో మిగిలిన పనులు**

తాగునీటి సరఫరాకోసం రూ.15 లక్షలతో వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే విద్యార్థుల బోధనకు అవసరమైన బోర్డులతో పాటు గదుల్లో ఫ్యాన్‌లు, ఇతరమౌలిక వసతులు కల్పించినట్లు వివరించారు. రెండు విడతలుగా మంజూరైన నిధులతో పనులు శర వేగంగా జరుగుతున్నాయని మూడో విడత నిధులు మంజూరు చేసిన వెంటనే మిగతా పనులు విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఇంజినీరింగ్ అధికారులద్వారా పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.



వాటర్‌ట్యాంక్



నిర్మాణం పూర్తి కావచ్చిన మరుగుదొడ్డి